ఆర్థిక సంఘం నిధులు జమ చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం వాడుకున్న 14, 15 ఆర్థిక సంఘం పంచాయతీ నిధులను తిరిగి జమచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో రమణరావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. రోడ్లు, తాగునీటి వసతి, మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈ ప్రభుత్వంలో విలువ లేకుండా పోయిందని, ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వాడుకున్న 14, 15 ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు జమచేసి గ్రామాభివృద్ధిని కాపాడాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో కె.వరప్రసాద్, వెలగలేటి మోహన్, కానూరు రాజు, కమిలి నాని, తోపు శ్రీను మాట్లాడారు.

దూసుకొస్తున్న మిచౌంగ్..!

ఆందోళనలో అన్నదాత - హడావుడిగా మాసూళ్లు - పంటను కాపాడుకునేందుకు అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మిచౌంగ్ తుపాన్ దూసుకొస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో అలజడి రేగింది. దీంతో పంటను కాపాడుకునేందుకు వరి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలవ్యాప్తంగా ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఆకస్మాత్తుగా తుపాన్ హెచ్చరికలతో రైతులు లబోదిబోమంటున్నారు. చేతికి వచ్చిన పంటను ఏ విధంగా కాపాడుకోవాలో తెలియక కలవరపడుతున్నారు. మండలంలో పదిరోజులుగా యంత్రాలతో, కూలీలతో ముమ్మరంగా వరికోతలు, నూర్పిళ్లు జరుగుతున్నాయి. నిన్న, మొన్నటి వరకూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కష్ట నష్టాలకోర్చి పండించిన పంట కోతకు వచ్చే సమయంలో తుపాన్ హెచ్చరికలతో వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన పంట చేజారే పరిస్థితి కనిపిస్తోందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి యంత్రాలకు అద్దె అమాంతంగా పెరిగిందని, కోత కోసే పరిస్థితి కానరావడంలేదని, కోతకు వచ్చిన వరిపంట చేతికందేనా అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో శనివారం నుంచి తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వాతావరణంలో మార్పులు రావడంతో కోతకు వచ్చిన పంటను యంత్రాలతో కోసి ధాన్యాన్ని ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ పరదాలు కప్పి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పనలపై ఉన్న వరిపైరును ట్రాక్టర్లల్లో లోడు చేసి చేలల్లో నుంచి బయటకు తీసుకువెళ్లి రక్షణ చర్యలు చేపడుతున్నారు. తుపాన్ తరుముకొస్తుండటంతో కల్లాల్లో, రోడ్ల వెంబడి అరబెట్టిన ధాన్య పు రాశు లను కూలీలతో కాటా వేయించి ట్రాక్టర్లపై ఆర్‌బికెలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, తేమశాతం వల్ల కొందరు రైతులు మాత్రం తుపాన్ దృష్ట్యా కల్లాల్లోనే దళారులకు అమ్మి చేతులు దులుపుకుంటున్నారు. ఆలాఅమ్మడం వల్ల 75 కేజీల బస్తాకు రూ.300 మేర నష్టపోవాల్సి వస్తోందంటూ రైతులు చెబుతున్నారు. తుపాన్ వల్ల పంట చేతికి వస్తుందో రాదోననే భయంతో కనీసం ఖర్చులన్నా వస్తే చాలు అంటూ దళారులకు అయిన కాడకు విక్రయించి తుపాన్ బారి నుంచి బయటపడే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి గాలులు వీచడంతో చాల గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలవాలింది. ఈ దశలో వర్షం కురిస్తే పంట నీటిలో నాని గింజ రంగుమారి మొలక వచ్చే ప్రమాదం ఉందని రైతులు బెంబేలెత్తుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ మండల రైతాంగం చేలల్లోని కల్లాల్లో, పనలపై, రాశులపై ఉన్న పంటను కాపాడుకునేందుకు నానా తంటాలుపడుతూ తమశక్తి కొలదీ శ్రమిస్తూ శాయశక్తులా పంటను కాపాడుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

ముదినేపల్లిలో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

లోడు చేస్తున్న ధాన్యం

వరి పనలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు

త్వరితగతిన మిల్లులకు ధాన్యం తరలించండి : కలెక్టర్

ఏలూరు: మిచౌంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా మాసూలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను హెచ్చరికల కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని పూర్తిగా ఆఫ్ లైన్ చేసి తగిన జాగ్రత్తతో రైసు మిల్లులకు తరలించేందుకు తగిన ఆదేశాలిచ్చామన్నారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఇప్పటివరకు 18,000 మెట్రిక్ టన్నుల కోతలు పూర్తయిన ధాన్యానికి కావాల్సిన గోనె సంచులు, వాహనాలు, ముఠా వారిని ఏర్పాటు చేసి ఇప్పటివరకూ ఏడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించామన్నారు. మిగిలిన ధాన్యానికి కూడా గోనె సంచులు, రవాణా వాహనాలు సమకూర్చి పూర్తిగా తరలించేందుకు తగినచర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు, జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. వారిద్వారా ధాన్యానికి ఎలాంటి నష్టమూ కలగకుండా తగిన చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బంది కలకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అంతే కాకుండా రైతులు ధాన్యం భద్రపరచుకోవాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గే వరకూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో ఖరీఫ్ పంట కాలం 2023-24కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియకు జిల్లాలో 261 ఆర్‌బికెలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి 133 కొనుగోలు సహాయక కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టి ఇప్పటి వరకూ 12,408 మంది రైతుల నుంచి రూ.203.25 కోట్ల విలువైన 93,090 మెట్రిక్ టన్నుల ధాన్యం కనీస మద్దతు ధరకు సేకరించామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రూ.152 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాలకు జమచేశామని తెలిపారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధరలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య అన్నారు. ఆదివారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ నగర కార్యకర్తల సమావేశం వి.సాయిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సోమయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచితే, రాష్ట్రం ఇంటి, నీటి, చెత్తసేకరణ పన్నులు, ఆర్‌టిసి, విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రశ్నిస్తున్న వారిపై దేశ ద్రోహం కేసులు పెడుతున్నారని, కవులు, రచయితలు, మేధావులను బిజెపి జైళ్లలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై పోలీస్ నిర్బంధం ప్రయోగిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల రక్షణకు, నిత్యావసర సరుకుల ధరల అదుపుకోసం ప్రజలంతా ఉద్యమించాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. జగన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నగరంలో పాడైన రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పవర్‌పేటలో బ్రిడ్జి, శనివారపుపేట కాజ్‌వే వంతెన నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, గోపి, ఇస్సాక్, కోటేశ్వరరావు, ఏసుబాబు పాల్గొన్నారు.

సజావుగా కొత్త ఓటర్ల నమోదు : డిపిఒ

ఏలూరు టౌన్: కొత్త ఓటరు నమోదు ప్రక్రియ సక్రమంగా జరగాలని డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ పోలింగ్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా పెదపాడు మండలం ప్రత్యేక అధికారిగా ఉన్న డిపిఒ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలిం చారు. బూత్‌స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొత్త ఓటరు నమోదు ప్రక్రియ ప్రత్యేక శిబిరం ఆదివారంతో ముగిసినా ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తులు తీసుకుంటామని, వచ్చే జనవరి నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఫారం-6తో పాటు అడ్రస్ ప్రూఫ్, పుట్టిన తేదీ, ఫొటో తదితర ఆధారాలు బూత్‌స్థాయి అధికారులకు సమర్పించి కొత్త ఓటరుగా నమోదు చేయించుకోవచ్చన్నారు. దూరప్రాంతంలో ఉన్నవారు voters.eci.gov.in సర్వీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. ఈ విషయంలో ఎవరికైనా సమాచారం, సహాయం కావాలంటే డిపిఒకు (సెల్ 9849903321)ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.విజయకుమార్, ఎంపిడిఒ ఎస్.సూర్యకుమార్, విఆర్‌ఒ శివ, బిఎల్‌ఒ నరేష్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు : ఎంపీ శ్రీధర్

టి.నరసాపురం: ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వ నూతన భవనాలు దోహదపడతాయని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో రూ.90 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంచడానికి శాశ్వత భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. గాంధీ కలలుకన్న స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు.

టిడిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

ముసునూరు: టిడిపి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరులో ఆదివారం 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ బాండ్లను టిడిపి మినీ మేనిఫెస్టోను వివరిస్తూ ఇంటింటికీ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి ఏ రంగంలో చూసినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. పాలన వివిధ శాఖల పనితీరు అంతా అవినీతిమయంగా, కక్షపూరితంగా సాగుతుందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టో వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నాలుగున్నరేళ్లలో వైసిపి చేసిందేమీ లేదన్నారు. పన్నుల రూపంలో దోపిడీ చేశారన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి మళ్లీ అవకాశం ఇస్తే రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి మహిళలు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, పాకనాటి సీతారామ్, గారపాటి నరసింహారావు, మెదరమెట్ల సురేంద్ర, పిచ్చియ్య, ఎన్.యోహాను పాల్గొన్నారు.

తుపాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల ఐదో తేదీ ఉదయం తుపాను నెల్లూరు, మచిలీపట్నం మధ్య బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నందున అప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తుపాను తీరం దాటే సమయంలో ఈదురు గాలులు ఉండొచ్చని, వాతావరణ శాఖ, తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఈ క్రింద తెలిపిన జాగ్రత్తలు, సత్వర చర్యలు తీసుకోవాలని రైతాంగానికి మండల వ్యవసాయాధికారి వేణుమాధవ సూచించారు. వరి పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉండగా, వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి, వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవడం, తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

సిపిఎస్, జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ అమలు చేయండి

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎంఎల్‌సిలు సాబ్జీ, వెంకటేశ్వరరావు

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ముస్తఫా ఆలీ, రవికుమార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణం అమలు చేయాలని ఎంఎల్‌సిలు, షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం మండలంలోని నారాయణపురం లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. వారికి చెల్లించాల్సిన బకాయి వేతనాలు, ఇతర అలవెన్సు బకాయిలను విడుదల చేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అతిథులుగా సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావుతో పాటు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జెఎసి జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు హరినాథ్, వివిధ ప్రజాసంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు. గత ఏడాది చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, సంఘం పనితీరు, ఉపాధ్యాయుల సమస్యల సాధనలో సహకారం అందించిన పరిస్థితి కార్యదర్శి నివేదికరూపంలో ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ అధ్యక్షత వహించారు. 400 మంది కార్యకర్తలు, జిల్లా కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ రుద్రాక్షి, గౌరవ అధ్యక్షులుగా ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వరరావు, వి.కనకదుర్గ, కోశాధికారిగా జివి.రంగమోహన్, కార్యదర్శులుగా విక్టర్, అల్లాడి రాజు, పివి.సాగర్‌బాబు, ఇ.వీరకోటి, పి.శ్రీనివాస్, పి.అనురాధ, ఎస్.రాంబాబు, ఎస్.సుధారాణి, సిహెచ్.శ్రీధర్, జి.దేవానంద్, కె.కమల్ కుమార్, ఎంవి.బేతాళరావు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా రవికుమార్ రుద్రాక్షి, షేక్ ముస్తఫా ఆలీ, పివి.నరసింహారావు, బి.బాలకృష్ణ, ఎం.రవిశంకర్, ఎ.దుర్గాభవాని, ఆడిట్ కమిటీగా ఆడిట్ కన్వీనర్‌గా బి.మోహన్‌రావు, సభ్యులుగా టి.ప్రసాద్, ఎమ్‌డి.నబీ, కె.గంగేడు, సిహెచ్.పిచోడు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి.మనోహర్ కుమార్, పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి వ్యవహరించినారు.

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

ఆళ్ల నానికి మెమెంటో అందజేస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

పాత్రికేయులకు అండగా ఉంటా

ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మహాసభలో ఎంఎల్ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పాత్రికేయులకు నిత్యం అండగా ఉంటానని, వారికి ఏ ఆపద వచ్చిన ఎల్లవేళలా తనను కలవొచ్చని మాజీ డిప్యూటీ సిఎం, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని అన్నారు. స్థానిక గిరిజనభవన్‌లో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో పాత్రికేయులు ఎనలేని పాత్ర పోషిస్తున్నారన్నారు. పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఈ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థలాలు అందించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వారికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు, ఆ స్థలాలలో పక్కా గృహాలు నిర్మించుకోవడానికి రూ.ఐదు లక్షల నిధులు మంజూరుకు సిఎం జగన్‌తో చర్చిస్తామని ఎపి ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ అధ్యక్షులు దెందులూరు నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు కొఠారు రామచంద్రరావు జర్నలిస్ట్‌లకు హామీ ఇచ్చారు. వైసిపి సీనియర్‌నేత కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను 40 ఏళ్లుగా అతి దగ్గరగా చూస్తున్నానని చెప్పారు. వారికి యాజమాన్యాలు జీత భత్యాలు ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. జర్నలిజాన్నే నమ్ముకుని భద్రతలేని ఆదాయం లేక సతమతమవుతున్నారన్నారు. వారి ఆర్థికపరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నెలకు రూ.పదివేలు గౌరవవేతనం అందించాలని ఒక నివేదికను దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి ద్వారా సిఎం జగన్ దృష్టికి తీసుకెళతానన్నారు. పాత్రికేయులందరికీ తారతమ్యం లేకుండా ఇళ్లస్థలాలు అందజేస్తామని చెప్పారు. అబ్రహం, సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నవీన్, శంకర్‌రావు, బాలశౌరి, జబీర్‌లు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

వృత్తి చెరువులపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలి

రజక గర్జన సభలో ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రవ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమకేసులు, రజక మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు, అపార్టుమెంట్ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీదారులపై అక్రమ కేసులు, వేధింపుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌కె గ్రౌండ్‌లో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడక రాజు అధ్యక్షతన జరిగిన రజక గర్జన సభలో భాస్కరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ రజకులపై దాడులు కొనసాగడం దుర్మార్గమన్నారు. దీనికి ఇప్పటి వరకు పరిపాలించిన పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు రజకుల అభివృద్ధి, సంక్షేమం ఏమాత్రం పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడం, విధివిధానాలు రూపొందించకపోవడం, రజకుల పట్ల ప్రభుత్వ ఉదాశీన వైఖరి తెలియజేస్తుందన్నారు. బిసి కార్పొరేషన్ నిధులను ప్రభుత్వమే ఇతర అవసరాలకు మళ్లించి రజకులను అభివృద్ధి చెందకుండా మోసపూరిత పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రజక అభివృద్ధి సంక్షేమం కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని ఏఒక్క రజకునికీ ఒక్క రూపాయి కూడా రుణ సహాయం అందించకుండా కాలయాపన చేశారని, రజక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. రజక అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ సమావేశాల్లో చేసిన తీర్మానాల్లో ఏ ఒక్కటీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించకుండా పెడచెవిన పెట్టడం దారుణమనానరు. తద్వారా రజకులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గడచిన నాలుగేళ్లలో వివిధ కులాల ప్రజలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం రజకులకు ఆత్మీయ సమావేశం నిర్వహించడానికి ఒక్కరోజు కూడా కేటాయించకపోవడం రజకుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎలాంటిదో రుజువు చేస్తుందన్నారు. లాండ్రీ వృత్తిదారులకు నెలకు 150 యూనిట్లు ఉచితంగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలను ఉద్ధరిస్తున్నట్లు సామాజిక, సంక్షేమ యాత్రల పేరుతో ఓటుబ్యాంక్ రాజకీయాలకు తెరతీస్తూ, బిసి సామాజిక తరగతులను మోసగిస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలపై సంఘటిత పోరాటాలకు రజకులు సమాయత్తం కావాలన్నారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్ మాట్లాడుతూ రజక వృత్తి సామాజిక సేవ వృత్తిగా పని చేస్తున్నారన్నారు. రజకులకు కూడా 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు నూకరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్న రజక వత్తిదారులందరూ తాడేపల్లిగూడెంలో చైతన్య తరగతులను జయప్రదం చేయాలన్నారు. పశువులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రజక వృత్తి సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సభలో సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కోనేటి రాజు, ఈశ్వరరావు, లింగాల నిర్మలమ్మ, అంకయ్య, సుబ్బారావు, దిలీప్, పాగోలు శ్రీనివాస్, వెంకట నరసయ్య, శ్రీనివాస్, నాగేంద్ర, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..!

నాడు 'ప్రజావాణి', ఆపై 'స్పందన'.. నేడు 'జగనన్నకు చెబుదాం'.. ప్రజలు తమ సమస్యలు అధికారులకు చెప్పుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు.. కార్యక్రమాల పేర్లు అయితే మారుతున్నాయనేగానీ సమస్యల పరిష్కారం మాత్రం నానాటికీ తీసికట్టుగా మారుతుందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి నిదర్శనం ప్రతి సోమవారం నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి ఇప్పటికీ వందల సంఖ్యలో అర్జీలు రావడం, వాటిలో సుమారు సగం గతంలో వినతులిచ్చినా పరిష్కరించలేదనేవే ఉండటం గమనార్హం.

ప్రజా సమస్యలు అపరిష్కృతంగా పేరుకుపోతున్నాయనడానికి నిదర్శనం ప్రతి సోమవారం ఆయా జిల్లాల కలెక్టరేట్లలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే వినతుల సంఖ్యే. గత సోమవారం ఏలూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 228 వినతులు రాగా, పశ్చిమగోదావరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందనకు 192 అర్జీలు వచ్చాయి. తాజాగా జగనన్నకు చెబుదాం పేరిట వారంలో బుధ, శుక్రవారాల్లో జిల్లా అధికారులే ఏదోక మండలం ఎంచుకుని మండలస్థాయిలో వినతులు స్వీకరించే కార్యక్రమం తలపెట్టారు. ఈ ఆలోచన, కార్యాచరణ కచ్చితంగా అభినందనీయం. తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రం వరకూ రావాల్సిన అవసరం లేకుండా జిల్లా అధికారులే మండల కేంద్రానికి వెళ్లడాన్ని అంతా స్వాగతిస్తున్నారు. అయితే వినతుల స్వీకరణ వరకూ అంతా బాగున్నా వాటి పరిష్కారం విషయంలోనే జనంలో తీవ్ర అసంతృప్తి పెరిగిపోతుంది. గ్రామ సచివాలయం, మండలస్థాయిలో పరిష్కరించాల్సిన వినతులు జిల్లాస్థాయికి వచ్చినప్పుడు జిల్లా అధికారులు అంత సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లాస్థాయి స్పందనలో ఇచ్చిన వినతులను సైతం కింది స్థాయి అధికారులకు పంపి చేతులు దులుపుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో గ్రామస్థాయి అధికారులు అర్జీదారుని ఇంటికి వెళ్లి 'మీ వినతి అందింది' అంటూ ఒక ఫొటో తీసుకుని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ సమస్య పరిష్కారమైపోయినట్లు మండల, జిల్లా అధికారులు ధృవీకరించేస్తున్నారు. దీంతో ఆయా అర్జీదారులకు ఏం చేయాలో పాలుపోక, సమస్య పరిష్కారం కాక తలలు పట్టుకుంటున్నారు. జిల్లా అధికారుల తీరుతో మండల, గ్రామస్థాయి అధికారులు సైతం స్పందన సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండల కేంద్రంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో తాను ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం అందిస్తున్న సాయం పూర్తిగా అందలేదని ఒక లబ్ధిదారుడు అర్జీ ఇచ్చాడు. ఆయన ఆరు నెలల క్రితం జిల్లా కేంద్రం భీమవరంలో నిర్వహించిన 'స్పందనలో'నూ వినతి ఇచ్చాడు. అయినా పరిష్కారం కాకపోవడంతో మండలస్థాయిలో జిల్లా అధికారులు నిర్వహించిన 'జగనన్నకు



చెబుదాం' కార్యక్రమంలో మరోమారు వినతి ఇచ్చాడు. దీనిపై సచివాలయ స్థాయి అధికారి 'మీరు ఎక్కడ అర్జీ ఇచ్చినా వచ్చేది మా దగ్గరకే..' అంటూ ఎగతాళిగా మాట్లాడటం గమనార్హం. ఆ అర్జీదారునికి సొమ్ము పడకపోగా వైబ్‌సైట్‌లో సమస్య పరిష్కారమైనట్లు చూపడం జిల్లా, మండలస్థాయి అధికారుల పర్యవేక్షణాలోపానికి, నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

సమీక్షలు.. హెచ్చరికలతోనే సరి

ప్రతివారం 'స్పందన' వినతుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లే నేరుగా సమీక్షిస్తున్నారు. అర్జీల పరిష్కారంలో కచ్చితంగా నాణ్యతతోపాటు అర్జీదారుడు సంతృప్తి చెందాలని పదేపదే హెచ్చరిస్తున్నారు. అయితే సమీక్షలు, హెచ్చరికలతో సరిపెడుతుండటంతో మండల, గ్రామస్థాయి అధికారుల తీరు మారడం లేదని తెలుస్తోంది. ఏలూరు జిల్లా అధికారులు ఈ విషయంలో కొంత మెరుగు అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. స్పందనలో వచ్చిన అర్జీలకు సంబంధించి పరిష్కారమైనట్లు కిందిస్థాయి నుంచి నివేదికలు వచ్చాక ఆ అర్జీదారులను కలెక్టరేట్‌కు రప్పించి కలెక్టర్ వారితో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేయడం కచ్చితంగా అభినందనీయం. ఈ ప్రక్రియ మండల, గ్రామాధికారుల్లో కొంత అప్రమత్తత పెంచిందనే చెప్పొచ్చు. అయితే పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం ఇలాంటి ప్రక్రియ చేపట్టకపోగా జిల్లా అధికారులే 'స్పందన' వినతులపై ఉదాశీనత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 'స్పందన' వినతి ఇచ్చాక సైతం పెనుమంట్ర మండలానికి చెందిన లబ్ధిదారుణ్ని ఇంటి సొమ్ము కోసం 'హౌసింగ్ డిఇని కలవండి, లేదా పీడీని కలవండి' అంటూ గ్రామ, మండల అధికారులు చెప్పడం ఇక 'స్పందన'లో వినతులివ్వడం ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి క్షేత్రస్థాయిలోనూ పరిశీలన ప్రారంభిస్తేనే జనానికి సమస్యల నుంచి ఊరట లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో వినతులపై అటు ప్రభుత్వం, ఇటు అధికారుల స్పందన కరువైందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుని ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీస్తుందని రాజకీయ పరిశీలకులు సైతం హెచ్చరిస్తున్నారు.

ఇక స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సైతం సమస్యలు నేరుగా తనకు చెప్పొద్దని, ఆయా స్థానిక సంస్థల అధిపతికే చెప్పాలని ముఖ్యఅధికారి పేర్కొనడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏలూరు జిల్లాలో ఒక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఇటీవల జరిగింది. దీనిలో ఒక కౌన్సిలర్ తన వార్డులో సమస్యలు పరిష్కారం కావడం లేదని కమిషనర్‌ను నిలదీశారు. దీనిపై కమిషనర్ చెప్పిన సమాధానం విస్మయం కల్గిస్తోంది. తన పరిధిలో లేని సమస్య అయితే సంబంధిత ఉన్నతాధికారులకో, లేదా ప్రజాప్రతినిధుల దృష్టికో తీసుకెళ్తామని చెప్పడం సర్వసాధారణం. అయితే దానికి భిన్నంగా 'సమస్యలేమైనా కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌కు చెప్పాలని, ఛైర్‌పర్సన్ చెబితేనే తాము పని చేస్తామనడం' స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సదరు అధికారి ఇచ్చే గౌరవం ఏపాటిదో స్పష్టమవుతోంది. అంటే 'స్పందన'లో ప్రజలు ఇచ్చే అర్జీలను పరిష్కరించని అధికార గణం, ఆ ప్రజాప్రతినిధులైన ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చట్టబద్ధమైన సమావేశంలో సమస్యలు ప్రస్తావించినా పట్టించుకోరా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తీరు కచ్చితంగా ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

-వివిఎస్ఎస్‌వి.ప్రసాద్



మిషన్లు అందిస్తున్న బ్యాంక్ సిబ్బంది

వాటర్ ప్రెజర్ పంప్ మిషిన్లు బహూకరణ

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

శ్రీవారి గోసంరక్షణ శాలకు రూ.3.50 లక్షల విలువైన 3 వాటర్ ప్రెజర్ పంప్ మిషిన్లను స్థానిక యూనియన్ బ్యాంక్ వారు అందజేశారు. ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు వాటిని ప్రారంభించారు. ముందుగా గోసంరక్షణశాలలో మిషిన్లకు ఆయన పూజలు నిర్వహించి అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భం ఇఒ మాట్లాడుతూ గోశాలను, ఆవులను శుభ్రపరచేందుకు ఇవి ఉపకరిస్తాయన్నారు. గోశాలకు అవసరమని తెలిసి వీటిని బహూకరించిన యూనియన్ బ్యాంక్ వారిని ఇఒ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, డిప్యూటి రీజనల్ హెడ్ డి.రామ్మోహన్‌రావు, స్థానిక బ్రాంచి మేనేజర్ కె.నాగశేషు పాల్గొన్నారు.

చింతలపూడి:కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ నేతల హర్షం

ప్రజాశక్తి - కైకలూరు

తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా కైకలూరులో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంగినేని బాబ్జి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కట్టా నాగరాజు గౌడ్, సోము కాశీ విశ్వనాథ్, కేసిరెడ్డి వెంకట శ్రీరామకృష్ణ, మద్దిరాల సంజీవరావు, అరిగేల వెంకటేశ్వర్లు, గంగుల గణపతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడంతో మండలంలో చింతలపూడి నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ విస్సంపల్లి సుందర్రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలాభిషేకం చేశారు. కేకు కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచి, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. దీంతో చింతలపూడిలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పింగుల సుబ్బారావు, జగ్గవరపు బోసురెడ్డి, కొనకళ్ళ కృష్ణమూర్తి, సందిపాము సుందరం, గార్లపాటి మురళీ, సంకు ప్రసాదు, మన్నే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసింహంపై కఠిన చర్యలు తీసుకోండి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని కోట్లు వసూలు చేసి ఉడాయించిన తలశిల నరసింహంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని కోట్లు వసూలు చేసి ఉడాయించిన ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ యజమాని తలశిల నరసింహంపై చర్యలు తీసుకుని, బాధితులైన వారికి డబ్బులు తిరిగి ఇప్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య కోరారు. తలశిల నరసింహం ఏలూరు నరసరావుపేటలో ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ అనే బోగస్ సంస్థ ఆఫీసు ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ శాఖలలో సూపర్వైజర్లు, ఎగ్జిక్యూటివ్స్, చీఫ్ ఎగ్జిక్యూటివ్స్, కోఆర్డినేటర్లు, ట్రైనీలు, పిఇటిలు తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి దాదాపు 200 మంది వద్ద నుంచి ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ యజమాని, వారి కుటుంబ సభ్యులు ఒక్కో పోస్ట్‌కి రూ.లక్ష నుంచి మూడు లక్షల చొప్పున కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. ఉద్యోగాలు ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసి ఆఫీసు మూసివేసి ఉడయించారని తెలిపారు. బాధితులు స్థానిక విద్యానగర్‌లోని నరసింహం ఇంటికి వెళ్లి అడగ్గా నేను డబ్బులు ఇవ్వను, ఉద్యోగాలు ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోండి అని బెదిరించారని, గట్టిగా నిలదీసి అడిగితే కొందరికి చెల్లని చెక్కులు ఇచ్చారని, అవి బ్యాంకులకు వెళ్లి పరిశీలించుకోగా చెక్ బౌన్స్ అయ్యాయని, విషయం తెలుసుకుని బాధితులు నరసింహం ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ విషయమై బాధితులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి వెంటనే స్పందించి మోసపోయిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని, మోసగించిన తలశిల నరసింహంను అరెస్ట్ చేసి బాధితుల డబ్బులు తిరిగి ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితులందరినీ కలుపుకొని వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించేంత వరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బాధితులందరూ ధైర్యంగా జిల్లా ఉన్నతాధికారులకు ఆఫీసులలో ఫిర్యాదులు చేయాలని కోరారు. అప్పటికి చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనకు సిద్ధం కావాలని ఆయన కోరారు. విద్యార్థి, యువజన సంఘాలు, నిరుద్యోగులైన బాధితులకు అండగా నిలవాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

దగ్ధమైన ట్రాక్టర్

లక్కవరంలో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరం గ్రామంలో గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన స్థానిక రైతులను ఆందోళనకు గురి చేసింది. ఆదివారం లక్కవరం పోలీస్ స్టేషన్, పుంతల ముసలమ్మ గుడి సమీపంలో విద్యుత్ తీగలు తగలబడడంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధమైందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడం వల్ల అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వినియోగదారుల హక్కులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి వినియోగదారుల హక్కులు, చట్టంపై అవగాహన ఉండాలని, భారతదేశంలో మొదటిసారిగా 1986లో వినియోగదారుల రక్షణ చట్టం ప్రవేశపెట్టబడిందని కొవ్వలి వినియోగదారుల సేవా మండలి అధ్యక్షులు కట్టా సత్యనారాయణ తెలిపారు. కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో ఏలూరు-సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆదిత్య కాలేజెస్ రీజినల్ మేనేజర్ ఆర్.నాగేంద్రబాబు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ అవగాహనా సదస్సులో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ ఈ చట్టం ఐక్యరాజ్యసమితి రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా తయారు చేశారని తెలిపారు. ఈ చట్టం అమలులో లోపాలను గుర్తించి, మరలా 2019 వినియోగదారుల చట్టాన్ని తీసుకురావడం జరిగిందని, ఈ చట్టం ద్వారా కల్తీలు, మోసపూరిత ప్రకటనలు, సేవా లోపాలకు సంబంధించి వినియోగదారులకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ మాయజాలంలో వినియోగదారులు నష్టపోతున్న విషయాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది సిపిఎస్ రామానుజాచార్యులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వినియోగదారులుగా అవగాహన కలిగి ఉండాలని, వ్యాపారస్తుల మోసాలకు గురి కాకుండా ఉండాలని, వస్తు సేవల విషయంలో మోసపోయిన వారు నష్టపరిహారానికి, జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల కమిషన్స్‌లో కేసులు వేయవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం సభాధ్యక్షులు ఆర్.నాగేంద్రబాబు మాట్లాడుతూ పుట్టిన ప్రతి వ్యక్తి చనిపోయే వరకు వినియోగదారుడే అని, వస్తు సేవలు పొందేటప్పుడు ప్రతి వ్యక్తి మంచి అవగాహనతో వాటిని పొందాలని, చెల్లించిన సొమ్ముకు తగిన విధంగా బిల్లు తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.వెంకటేశ్వరరావు, బి.లోకేష్, వీరభద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

'విఘ్నేశ్వర' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

వికలాంగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న గుండుగొలనుకు చెందిన విఘ్నేశ్వర వికలాంగుల సేవాసమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా దాత ఇందుకూరి త్రిమూర్తి రాజు ఆధ్వర్యంలో 60 మంది వికలాంగులకు సన్నబియ్యం, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులను, సేవా సమితి కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.50 వేల విరాళాన్ని అయన అందజేశారు. ఇదేవిధంగా ఏలూరుకు చెందిన శ్రీకృష్ణ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ శ్రీకృష్ణ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వికలాంగుల సేవాసమితి సిఫారసుతో వచ్చే వికలాంగులకు వైద్యశాల ద్వారా సేవలందించేందుకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఇదేవిధంగా గ్రామ పరిధిలో ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు సహకారం అందజేస్తున్న 26 మంది పారిశుధ్య కార్మికులకు సేవా సమితి తరపున దాతల సహకారంతో నిత్యావసరాలు, దుస్తులు, పండ్లు, ఇతర అంశాలను అందజేశారు. ఇదే క్రమంలో కార్తీక మాసం పుర స్కరించుకొని విక లాంగులు, పారిశుధ్య కార్మికులు, ప్రముఖుల భాగస్వామ్యంతో వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సహపంక్తి భోజనాలు చేశారు. సేవా సమితి చేపట్టే కార్యక్రమాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు దాట్ల సీతారామరాజు, రామ కృష్ణంరాజు, పి.శ్యామలరావు, సిరిబత్తిన కొండబాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక అగాపే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళకు వినికిడి యంత్రం అందజేశారు. ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల 64వ వారోత్సవాల సందర్భంగా అగాపే సంస్థ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్, డివైఎఫ్ఐ సంయుక్త సహకారంతో విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలను అగాపే కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అగాపే వ్యవస్థాపక అధ్యక్షులు ఆశిబాబు మాట్లాడుతూ కామవరపుకోట మండలం కోడిగూడెం గ్రామస్తురాలైన కస్సే లక్ష్మి(64) వృద్ధ వితంతు మహిళకు వినికిడి యంత్రం ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు కావాల్సింది సానుభూతి కాదని, మానవత్వంతో కూడిన సాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ ప్రతినిధి జవ్వాజి ఉమా వెంకటేష్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మాబు సుభాని, టి.సుజిత, అందుగుల నాగరాజు మాస్టారు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజంలో విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహం అందించాలని మండల విద్యాశాఖాధికారి బి.రాముడు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం కొత్తపేట భవితా పాఠశాలలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి బి.రాములు, వార్డు కౌన్సిలర్లు కరుటూరి రమాదేవి, వలవల తాతాజీ, చిరంజీవి యువత అధ్యక్షులు ఉక్కుర్తి సీతారాం చేతుల మీదుగా చిన్నారులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి యువత గౌరవ అధ్యక్షులు ఉక్కుర్తి సీతారాం రూ.20 వేలతో చిన్నారులకు భోజన ఏర్పాట్లు చేయగా, జవ్వాది ఉమా వెంకటేశ్ దుప్పట్లు, వేగవరం సరస్వతీ స్కూల్ యాజమాన్యం పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు కొత్తపల్లి సురేష్, షేక్ హసీనా మస్తాన్, పేదవేగి రాంబాబుల తోడ్పాటుతో పాటు తమ సేవలందించారు. ఈ కార్యక్రమంలో భవిత్యా స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు రజని, ఉపాధ్యాయులు రజని, చైతన్య, ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయులు నాగబాబు, స్కూల్ సిబ్బంది భవానీ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



భీమడోలు : వికలాంగులకు దుస్తులు అందజేస్తున్న దాతలు



జంగారెడ్డిగూడె: వినికిడి యంత్రం అందిస్తున్న ఆశిబాబు



మహాసభకు తరలివెళ్తున్న జర్నలిస్టులు

ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మహాసభకు తరలిన జర్నలిస్టులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మహాసభకు స్థానిక జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఆదివారం ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మహాసభ ఏలూరులోని కలెక్టరేట్ వద్ద గిరిజన భవన్‌లో జరగనున్న నేపథ్యంలో స్థానిక ప్రియదర్శిని కలశాల నుంచి జర్నలిస్టులు బయలు దేరారు. ఈ సందర్భంగా స్థానిక విద్యావేత్త అలుగు ఆనంద శేఖర్ మాట్లాడుతూ ఎంతోకాలంగా జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మహాసభకు తరలిన పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులందరూ ఐకమత్యంగా ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కారానికి పోరాడాలని సూచించారు.

ఓటర్ల నమోదు కార్యక్రమంపై బిఎల్ఒకు సూచిస్తున్న పీడీ

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని డ్వామా పీడీ మండల ప్రత్యేక అధికారి ఎ.రాము బిఎల్ఒలకు సూచించారు. ఆదివారం మండలం వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై వుండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేపించాలని బిఎల్ఒలకు ఆదేశాలు ఇచ్చారు. అదే విధంగా ఓటరు నమోదు ప్రక్రియ పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించి వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్ సింగ్, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, ఎపిఒ జాన్ వెస్లీ, విఆర్ఒలు పాల్గొన్నారు.

చింతలపూడి: మండలంలో ఆకస్మికంగా పోలింగ్ బూత్ స్టేషన్లను జిల్లా డిఇఒ శ్యామ్ సుందర్ తనిఖీ చేశారు. మండలంలో 17 బూత్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఓట్లు నమోదు, మార్పులు, చేర్పులు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అభ్యంతరాలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.



చింతలపూడి:పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిఇఒ

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

మారుమూల ప్రాంతాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని సూరప్పగూడెం సాల్వేషన్ ఆర్మీ ప్రార్థనాలయానికి చెందిన పాస్టర్ భూపతి పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ప్రార్థన ఆలయం సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించే ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసే ఉచ్చుల సుజాతచే బత్తిన ఏసుదాసు సర్దుబాటులో భాగంగా మండల పరిషత్ యాజమాన్య పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఇదేవిధంగా పూళ్ల ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇదే గ్రామానికి చెందిన మండే సుధాకర్ కూడా మండల పరిషత్ యాజమాన్య పాఠశాలకు బదిలీ అయ్యారు. ప్రార్థన ఆలయం ఆధ్వర్యంలో స్థానికంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సన్మానించారు. పలువురు ప్రముఖులు బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు వి.వెంకట్రావు, వి.మధు, బి.ఆదాం పాల్గొన్నారు.



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అవకాశం ఇవ్వండి అభివద్ధి చేస్తా

మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రజలందరూ నాకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య తెలిపారు. మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఆదివారం గ్రామస్తులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని, ముఖ్యంగా రైతులకు సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తి చేస్తానని అన్నారు. చీపురుగూడెం, చిన్నంపేట గ్రామాలలో స్మశాన వాటికలలో బోర్లు వేయించి స్మశాన వాటికలను శుభ్రం చేయడం జరిగిందని తెలిపారు. గ్రామస్తుల సమస్యలపై వెంటనే స్పందించి వారికి నా పూర్తి సహకారాలు అందిస్తానని, రాబోయే ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానన్నారు. ఈ కార్యక్రమాన్ని చిన్నంపేట మాజీ సర్పంచి డాక్టర్ బాబు, కొమ్ము సుజాన్ రావు, నాగేశ్వరరావు నిర్వహించారు.

వన సమారాధనతో ఐక్యతాభావం

ఉంగుటూరు:బహుమతులతో విజేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కార్తీక వన సమారాధనతో ఐక్యతా భావం పెంపొందుతుందని ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు అన్నారు. నారాయణపురం కళింగ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి కళింగ కార్తీక వన సమారాధన నిర్వహించారు. కళింగ కులస్తులు ఒకచోట చేరి ఆత్మీయ సమారాధన నిర్వహించుకోవడం అభినందనీయమని ఎంఎల్ఎ కితాబ్ ఇచ్చారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు మాట్లాడుతూ మీరంతా ఐక్యమత్యంతో ఉండాలని సూచించారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతి కృష్ణారావు మూల కళ్యాణి, ఏలూరు సంఘం అధ్యక్షుడు దుప్పల లక్ష్మణ మూర్తి, కైకరం ఎంపిటిసి సభ్యుడు పేడ్డ అప్పన్న మాట్లాడారు. వివిధ సంప్రదాయ పిల్లలతో సంతోషంగా గడిపారు. పలువురు చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీల్లో మహిళలు పాల్గొనడం విశేషంగా ఆకట్టుకుంది. ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు. నారాయణపురం ఎంపిటిసి సభ్యుడు హరివిల్లు మహాలక్ష్మి దనయ్య, పైడి అరుణ్ కుమార్, పైడి వరప్రసాద్, రాజారావు, బొమ్మిడి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలోని వడాలి పద్మశాలి బజార్ రావిచెట్టు వద్ద ఆదివారం కైకలూరు నియోజకవర్గ పద్మశాలి కుల కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. వైసిపి సీనియర్ నాయకురాలు తిరువీధుల శారద ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పద్మశాలి కుల సంఘ పెద్దలు, వైసిపి సీనియర్ నాయకురాలు శారదను ఘనంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ వన సమారాధనలో పెద్ద ఎత్తున పద్మశాలి కులస్తులు, పెద్దలు పాల్గొన్నారు.



ముదినేపల్లి:శారదను సన్మానించిన కుల పెద్దలు

డేటా ఎంట్రీ శిక్షణా కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో ఎపిఎస్ఎస్‌సి ఆధ్వర్యంలో స్వల్పకాలిక కోర్సుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమస్త ప్రధాన అధికారి దేవరకొండ భూషణం తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉపాధి కల్పిస్తారన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కోఆర్డినేటర్ నెంబర్ 8374039719 ను సంప్రదించాలని తెలిపారు.

కన్నాయగూడెంలో ఆలయ నిర్మాణం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కన్నాయగూడెం గ్రామంలో గోవిందమాంబ, మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం జరుగుతుంది. గ్రామం నుంచి పొంగుటూరుకు వెళ్లే మెయిన్ రోడ్ పక్కన ఆలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. స్వామి వారు, అమ్మ వారుతో పాటుగా సిద్దయ్య, ఏకాంబరేశ్వర స్వామి వారు, ధ్వజ స్తంభ సహితంగా ఆలయ నిర్మాణం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నాలుగు వేల మంది పిల్లలతో బాలోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 30, 31వ తేదీల్లో చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో 4 వేల మంది పిల్లలతో బాలోత్సవం పోటీలకు ఏర్పాటు చేసినట్లు వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, భీమవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. శ్రీరామపురంలో గాంధీ కస్తూరిబా భవనంలో భీమవరం బాలోత్సవం కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. నాలుగు వేల మందితో నిర్వహించనున్న పోటీల్లో పది అంశాల్లో విద్యా సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నామన్నారు. భీమవరం పట్టణం, భీమవరం రూరల్, పాలకోడేరు, ఉండి, వీరవాసరం, కాళ్ల మండలాల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు కెబివి.మురళీకృష్ణ, పి.సీతారామరాజు, షేక్ వలీ, జి.జేమ్స్, పివి.సూర్యనారాయణ, సిహెచ్.పట్టాభిరామయ్య, కె.అశోక్, పి.శ్రీనివాసరాజు, కైఎస్.సిహెచ్ సాయిరామ్, రేపాక వెంకన్నబాబు, చైతన్యప్రసాద్, కె.చంద్రరావు పాల్గొన్నారు.

వైసిపితోనే దళితుల అభ్యున్నతి

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ ఆనంద్‌ప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం కృషి చేయని విధంగా దళితుల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎస్‌సి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చెల్లెం ఆనంద్‌ప్రకాష్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌ప్రకాష్ మాట్లాడుతూ దళితులకు సంబంధించి 24 పథకాలు జగనన్న ప్రభుత్వం నిలిపి వేసిందని ప్రతిపక్షాలు కుట్ర పూరితంగా ఆరోపిస్తున్నాయని, అది నిజం కాదని తెలిపారు. సబ్‌ప్లాన్‌లో ఎస్‌సిలకు ఏడు శాతం, ఎస్‌టిలకు 15 శాతం నిధులు విడుదలవుతాయని, కాని మన జగనన్న అంతకు మించి ఖర్చు చేసి దళిత సమాజాన్ని, దళిత వాడలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. నాడు-నేడు పథకంలో స్కూళ్లను, హాస్టల్స్‌ను అభివృద్ధి చేసి, జగన్ తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ప్రభుత్వం పాఠశాలలో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టారని, ఈ విధానం దళిత విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వం దళితులను రాజకీయంగా ఆర్థికంగా ఎదగనివ్వలేదని, కనీసం ఎస్‌సి, ఎస్‌టి సప్లై నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టలేదని, దీంతో దళితులకు గత ప్రభుత్వంలో ఎంతో నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ లలిత కుమారి, ఎస్‌సి నాయకులు సత్య సుధామ, కటికతల రాజారావు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవచ్చు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పచ్చి బియ్యం కాకుండా ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తుపాను, అధిక వర్షాల సమయంలో వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో, ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరి రైతులు తగిన జాగ్రత్తలు చేపట్టి పంట నష్టాన్ని నివారించుకోవాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలను వర్షాలకు ముందు రైతులు కోయరాదని తెలిపారు. కోసినా పూర్తిగా ఆరని పనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లాలని చెప్పారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలని సూచించారు. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా రైతులు భద్రపరుచుకోవాలన్నారు. నూర్చిన ధాన్యం రెండు, మూడు రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక లేక ఎండుగడ్డి కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారిం చుకోవచ్చని తెలిపారు.